

గణనాథుడు ప్రజలను చల్లగా చూడాలి

కార్మికశాఖ మంత్రి వివేక్



పూజలు చేస్తున్న మంత్రి వివేక్

గోదావరిఖని, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రజలను గణనాథుడు చల్లగా చూడాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. మంగళవారం గోదావరిఖని కళ్యాణ్‌నగర్, అశోక్‌నగర్‌లోని గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి పని చేస్తే ఫలితం దక్కుతుందన్నారు. కళ్యాణ్‌నగర్ యూత్ వర్తక సంఘం నాయకుడు కామ విజయ్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. నాయకులు మల్లికార్జున్, గుమ్మడి కుమారస్వామి, రాచకొండ కోటేశ్వర్లు, దుబాలి లలిత మల్లేష్, గడ్డం మధు, నర్సింగ్ దొర, తిప్పారపు మధు, గడ్డం సత్యానారాయణ, ముచ్చకుర్తి మహేష్, తిరుపతి, సత్యప్రసాద్, చందర్ ఉన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో పని చేయని లిఫ్ట్

- ఇబ్బంది పడుతున్న రోగులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెల రోజులుగా లిఫ్ట్ పని చేయక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పాత బిల్డింగ్‌లో లిఫ్ట్ పని చేయకపోవడం, రెండో అంతస్థులో ఉన్న 2డీ ఎకో, రక్తపరీక్షలకు, చిల్డ్రన్, ఆర్థో, జనరల్ వార్డుల్లో చికిత్స పొందే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ సభ్యులే రోగులను వీల్ ఛైర్‌లో తీసుకెళుతున్నారు. నెలరోజులుగా లిఫ్ట్ పని చేయడం లేదని సూపరింటెండెంట్‌కు చెబుతున్నా మరమ్మతు చేయించడం లేద రోగులు పేర్కొంటున్నారు. వారం రోజులుగా ఆసుపత్రికి 1500 నుంచి 1700వరకు ఓపీ కోసం రోగులు వస్తున్నారు. రెండు అంతస్థుల భవనంపైకి వెళ్ళేందుకు రోగులు ఆయాస పడుతున్నారు. లిఫ్ట్ మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

పంట నష్టంపై వ్యవసాయాధికారుల సర్వే



జ్యోతినగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గోదావరి వరద ముంపులో మల్కాపూర్‌లో పంట నష్టం వాటిల్లింది. మంగళవారం రామగుండం వ్యవసాయ అధికారి కె.ప్రకాష్, విస్తరణ అధికారి కె.శ్రీకాంత్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రైతులకు జరిగిన పంట నష్టం వివరాలను నమోదు చేశారు. పంట నష్టంకు సంబంధించి ప్రాథమిక అంచనా నివేదికను పంపిస్తున్నామని ఏవో కె.ప్రకాష్ తెలిపారు. పొలాల సందర్శనకు వచ్చిన అధికారులకు రైతులు సహకరించాలని, పట్టాదార్ పాస్ బుక్, ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలను తెలుపాలన్నారు.


పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున ఈ సమయంలో ఎరువులు చల్లితే ప్రయోజనం లేదని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ సూచించారు. మంగళవారం కన్నాలలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. యూరియా చల్లితే నీటిలో కొట్టుకు పోతుందన్నారు. ప్రస్తుత అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. ఎల్కలపల్లి, కన్నాల, బామ్లానాయక్‌తండా రైతులకు 20 టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. 52 మంది రైతులకు టోకన్లు ఇచ్చామన్నారు. ఏఎస్‌ఐ సత్యనారాయణ పర్యవేక్షించారన్నారు.

- ముగిసిన పంచాయతీ ఓటర్ల ప్రక్రియ
- జిల్లాలో 4,04,181 మంది ఓటర్లు
- పురుషులు 1,98,728 మంది, స్త్రీలు 2,05,439 మంది
- ముసాయిదాకు తుది జాబితాలో తగ్గిన 28 మంది ఓటర్లు



మంథనిలో ఓటర్ల తుది జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సమాయత్తమ వుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో గ్రామ పంచా యతీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను మంగళవారం అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాలోని 13 గ్రామీణ మండలాల్లోని 263 గ్రామ పంచాయతీల్లో 2432 వార్డులు, 2432 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 4,04,181 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,98,728 మంది, స్త్రీలు 2,05,439 మంది, ఇతరులు 14 మంది ఉన్నట్లు ప్రకటించారు. ముసాయిదా జాబి తాతో పోలిస్తే 28 ఓట్లు తగ్గాయి, పురుషులు 16 మంది, స్త్రీలు 12 మంది ఓట్లు తగ్గాయి.

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి కూడా ఓటర్ల తుది జాబాతాను ఈనెల 6వ తేదీన ముసాయిదా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం ఈ నెల 10వ తేదీన తుది జాబితాను వెల్లడించనున్నారు. ఈ నెలాఖరు వరకు స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈ ఎన్నికల నిర్వహణకు ప్రధాన సమస్య బీసీలకు

మండలాల వారీగా పంచాయతీ ఓటర్ల తుది జాబితా..

క్రసం.	మండలం	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
1.	అంతర్గాం	15	132	8807	9122	1	17930
2.	ధర్మారం	29	266	21483	22210	4	43697
3.	ఎలిగేడు	12	114	9088	9481	1	18570
4.	జూలపల్లి	13	130	11977	12186	0	24163
5.	కమాన్‌పూర్	9	92	9875	10270	0	20145
6.	మంథని	35	282	17040	17929	4	34973
7.	ముత్తారం	15	138	11328	11868	1	23197
8.	ఓదెల	22	198	17588	18219	0	35807
9.	పాలకుర్తి	16	156	13934	14184	0	28118
10.	పెద్దపల్లి	30	294	24989	25996	1	50986
11.	రామగిరి	16	158	16167	16406	1	32574
12.	శ్రీరాంపూర్	24	226	17225	17595	1	34821
13.	సుల్తానాబాద్	27	246	19227	19973	0	39200
	మొత్తం	263	2432	198728	205439	14	404181

42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు, 2018 పంచాయతీరాజ్ చట్టం, 2019 పుర పాలక చట్టాలను సవరించి ఆర్డినెన్స్ లను రాష్ట్ర గవర్నర్ పంపించగా, అక్కడి నుంచి రాష్ట్రపతికి పంపించారు. ఆ బిల్లులపై ఎటూ తేలక పోవడంతో ఎన్నికలు జాప్యం అవుతున్నాయి.

చివరకు ప్రభుత్వం ఈ నెల 1వ తేదీన నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు సభ ఆమోదం పొందింది. దీనిపై ప్రభుత్వం జీవో విడుదల చేయనున్నది. ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేని

(మిగతా 8వ పేజీలో)




లక్ష్మీనగర్‌లో భారీ వినాయకుడు

కళ్యాణ్‌నగర్‌లో పాముపై కొలువుదీరిన గణనాథుడు

ఖనిలో విభిన్న గణనాథులు



బోల్ల బజార్‌లో భారీ గణనాథుడు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా గణనాథులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. బోల్ల బజార్‌లో వ్యాపారులు 21పీట్ల ఎత్తులో ఏర్పాటు చేసిన గణనాథునికి కరెన్సీతో అలంకరణ చేశారు. లక్ష్మీకాంప్లెక్స్ వద్ద ఉన్న 16పీట్ల విగ్రహం భక్తులను ఆకట్టుకున్నది. కళ్యాణ్ యూత్ ఆధ్వర్యంలో ఏడుతలల పాముపై గణనాథుడు కూర్చొని చేతితో పట్టుకోవడం ఆకర్శిస్తుంది.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కొనసాగుతున్న మరమ్మతులు

- ఈనెల 10వ తేదీ తరువాతే ఉత్పత్తి దశలోకి
- మరమ్మతులకు హైదరాబాద్‌కు యంత్ర సామగ్రి
- ఫ్యాక్టరీకి ఇన్సూరెన్స్.. రైతులకు తీరని కష్టాలు

7

బీఆర్ఎస్-కాంగ్రెస్ హోరాహోరీ



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులను విరమింపజేస్తున్న పోలీసులు

ధర్మారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హోరాహోరీ కార్యక్రమాలు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసును సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఆధ్వర్యంలో నాయకులు వరంగల్ - రాయపట్నం రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్ట్‌లో మూడు పిల్లర్లు కుంగడం చిన్న విషయమని, మరమ్మతు చేపట్టకుండా ప్రాజెక్ట్ విఫలం అయిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ కుట్రపన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనను విరమింపజేసే ప్రయత్నంలో పోలీసులకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు జరిగిన తోపులాటలో మేడారం సింగిల్ విండో చైర్మన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బీఆర్ఎస్ నిరసన అనంతరం వైఎస్ఆర్ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించ తలపెట్టారు. బీఆర్ఎస్ నాయకుల అవినీతి మరకలతో ఆ ప్రాంతమంత అపవిత్రమైందంటూ గోదావరి జలాలతో శుద్ధిచేసే చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీగా మేడారం రిజర్వాయర్‌కు చేరుకొని అక్కడి నుంచి బిందెలలో గోదావరి జలాలను తీసుకువచ్చారు. అంబేడ్కర్ చిత్రపటం తోపాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రప టాన్ని గోదావరి జలాలతో శుద్ధిచేసిన అనంతరం వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు.



మేడారం రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను తీసుకువస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకొన్న పోలీసులు

ఓదెల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు గుంపులలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకొన్నారు. నాయకులు రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. యూరియా కొరత ను నివారించి రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంట రాములు, ఆళ్ళ రాజిరెడ్డి, మ్యాడగొని శ్రీకాంత్, పాల్గొన్నారు.

వాహనముల వేలం ప్రకటన

స్థలం : శ్రీరామ్ ఆటోమాల్, అల్గునూర్, కరీంనగర్

NO	VEHICLE NO	MAKE DESCRIPTION	MODEL
1	TS 22T 0522	MARUTI DZIRE TOUR DIESEL-P	2016
2	TS01UC3124	EICHER 11.10XP FBT	2015
3	TS08UB4456	TATA LPT 3118 CUMMINS FBT	2015
4	AP29TB0027	TATA LPT 3118 CUMMINS FBT	2010
5	AP02TC6217	TATA ACE	2014
6	TS02FF8525	MARUTI SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2011
7	TS22T6348	FORCE TRAVELLER SHAKTIMAN	2019
8	AP21BK1912	MAHINDRA 605DI HARVESTER	2015
9	AP37AX4569	MARUTI SWIFT VDI	2010
వాహనముల వేలం ప్రకటన స్థలం : శ్రీరామ్ ఆటోమాల్, సీతారాంపల్లి, మంచిర్యాల			
10	TS02UA5556	EICHER 11.10 FBT	2015
11	AP36TB0048	EICHER 11.10XP FBT	2012
12	TS 22 5868	JOHN DEERE 5310 HARVESTER	2017
13	TS22B0780	JOHNDEER 5310	2017
14	TS02UA2578	SWARAJ 834	2014
15	TS02UB4027	ASHOKLEYLAND 2518 TIPPER	2016
16	AP05TM0819	EICHER PRO 6025T	2017
17	AP09CP0095	TOYOTA INNOVA	2012

సంప్ర: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

Opp : Tumsup Godam, Near Kaman, Peddapalli. Ph: 08782-224455

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్ లు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, విద్యా శాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పై చదువులకు సర్టిఫికెట్లను ఇవ్వాలన్నారు. పెండింగ్ లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా కేంద్రంలో బాలికల జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని, బాలికల ఎస్సీ, ఎస్ఎంఎస్ కాలేజ్ హాస్టల్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బండెల రాజ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు ఆదిత్య నాయకులు నరేష్,అబి, అక్షయ, శ్రావ్య, మానస విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

సుల్తానాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతు సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి హైకోర్టు అనుమతి ఇచ్చినందున ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న దరఖాస్తులను సిద్ధం చేసుకోవాలని, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే పరిష్కరించాలని, అసైన్డ్ భూములకు పట్టాల కోసం వచ్చిన దరఖాస్తులలో అర్హుల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్ బషీరొద్దిన్, అధికారులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి కావాలి

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కంటే ముందుగానే ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు మార్కింగ్ పెండింగ్‌లో ఉందన్నారు. మార్కింగ్ పూర్తి చేసిన లబ్ధిదారులంతా నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. మార్కింగ్ చేసిన ఇండ్లు బేస్మెంట్ స్థాయికి చేరుకునేలా హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు, కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. పెట్టుబడి సమస్య ఉంటే మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించాలని పేర్కొన్నారు. వన మహోత్సవంలో నాటిన ప్రతీ మొక్కకు కర్ర, ట్రీ గార్డ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొక్కల జియో ట్యాగింగ్ చేయాలని, గ్రామాల్లో రెగ్యులర్‌గా ఫాగ్గింగ్ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి అధికమవుతుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పీడీ హౌసింగ్ రాజేశ్వర్ రావు, జడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీర బుచ్చయ్య, అధికారులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న

షాపింగ్ కాంప్లెక్స్

- ఆక్రమణల తొలగింపు
- 15ఏళ్ల తరువాత వ్యాపారాలు



షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పోచమ్మ మైదానంలో షాపింగ్ కాంప్లెక్స్ ముందున్న అక్రమణలను తొలగించడంతో ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. కాంప్లెక్స్ నిర్మించిన 15ఏళ్ల తరువాత షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు మొదలయ్యాయి. కాంప్లెక్స్‌లోని గదుల్లో తక్కువ అద్దె ఉండడంతో వ్యాపారాలు ప్రారంభించారు. పోచమ్మమైదానంలో 50ఏళ్ల నుంచి కూరగాయలు, మటన్, చికెన్, ఫిష్ మార్కెట్, సింగరేణి బ్యారెక్స్, ట్రేడ్ యూనియన్ కార్యాలయాలు, ఇతర వ్యాపారాలు ఉండేవి. ఈ వ్యాపారులు సింగరేణికి అద్దె కూడా చెల్లించేవారు. రామగుండం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శాశ్వతంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి 2006లో అప్పటి మున్సిపల్ చైర్మన్ రాయలింగం సింగరేణికి లేఖ రాయడంతో మున్సిపాలిటీకి స్థలం ఇచ్చేందుకు అంగీకరించింది. మున్సిపల్ పాలకవర్గం, సింగరేణి సంస్థలు ఒక్కతాటిపైకి వచ్చి అందులో ఉన్న కట్టడాలను 2006లో తొలగించి పెన్సింగ్ ఏర్పాటుచేశారు. ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి డీటీసీపీ అనుమతులిచ్చింది. అదే సమయంలో పాలకవర్గం గడువు ముగియడంతో పట్టాదారులుగా చెప్పుకుంటున్న కొందరు ప్రభుత్వ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదిత స్థలంలో రిజిస్ట్రేషన్లు చేశారు. డీటీసీపీ అనుమతులను కాదని మున్సిపా లిటీ అధికారులు దొడ్డిదారిన ప్రైవేట్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. అప్పటి నుంచి ఈ వివాదం నడుస్తున్నది. ఇటీవల జరిగిన సర్వేలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేసినట్టు గుర్తించి నిర్మాణాలను సింగరేణి సంస్థ తొలగించింది. ఆక్రమణలు తొలగిపోవడంతో కాంప్లెక్స్ వినియోగంలోకి వచ్చింది. రోడ్డు విస్తరణకు కూడా మార్గం సుగమమం అయ్యింది. కాగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వ్యాపారాలకు అనువుగా లేదని, దీనిని రీ మోడలింగ్ చేసి ఆధునీకరించాలని వ్యాపారులు కోరుతున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డ ఒకరికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనిజ కోహిర్‌కార్ మంగళవారం తీర్పునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో 2020 సంవత్సరంలో బక్కశెట్టి కొమురయ్య అనే వ్యక్తి చోరీకి పాల్పడి నగదుతో పాటు విలువైన వస్తువులు అపహరించుకు వెళ్లాడు. పోలీసుల విచారణలో మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన కొమురయ్య దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టు హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు సాక్ష్యులను ప్రవేశపెట్టగా అదనపు పీపీ రాజేష్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి కొమురయ్యకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

నీటి కోసం మహిళల నిరసన

శంకరపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గృహ అవసరాలకు నీరు రావడం లేదని మొలంగూర్ గ్రామంలో ఓ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం రాత్రి రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నామని సంబంధిత అధికారికి చెప్పిన ఫలితం లేకపోవడంతో రోడ్డుపైన నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు.

సాగులో డ్రోన్లు

ఆధునికతను అందిపుచ్చుకుంటున్న రైతులు
ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తే మరింత మేలు



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతికతలను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణవైపు అడుగులు వేస్తున్నారు. కూలీల కొరతను అధిగమించడంతో పాటు పంట దిగుబడి పెరిగి పెట్టుబడి ఖర్చులు తగ్గించే క్రమంలో రైతులకు డ్రోన్లు ఒక వరంలా మారాయి. ఒక రైతు చేతి పంపుతో ఒకరోజులో సుమారుగా 5 ఎకరాల వరకు పిచికారీ చేస్తే నేడు డ్రోన్ల రాకతో ఖర్చు తగ్గడంతో పాటు ఒకరోజులో గరిష్ఠంగా 30 ఎకరాల వరకు మందు పిచికారీ చేస్తున్నారు. చేతి పంపుతో పిచికారీ చేయడానికి ఒక లీటర్ మందు ద్రావణం సుమారుగా 7 నుంచి 8 పంపుల నీటిలో అంటే 150 నుంచి 160 లీటర్ల నీటిలో కలుపుతారు. దీనివల్ల ద్రావణం పలుచగా అవడం వల్ల మందు ప్రభావం కొంత మేర తక్కువగా ఉంటుంది. అదే డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేయడం కోసం ఒక లీటర్ మందు ద్రావణం ఒక డ్రోన్ ట్యాంక్‌లో అంటే సుమరుగా 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తారు. దీనివల్ల ద్రావణం చిక్కగా ఉండి మొక్కల ఆకుల భాగంలో పడటం వల్ల ఎక్కువ ప్రభావం చూపుతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుత సమయంలో కొంత మేర యూరియా కొరత ఉన్నందున యూరియా వాడకాన్ని తగ్గించడానికి నానో యూరియా వాడకాన్ని వ్యవసాయశాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. డ్రోన్లతో నానో పిచికారీ చేస్తే ఎక్కువ ప్రభావం చూపుతుందని తెలుపుతున్నారు. ఇప్పుడిప్పుడే వ్యవసాయంలో డ్రోన్లు వాడుతుండటంతో వాటి ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. ఇందుకు అనుగుణంగా డ్రోన్ల వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రైవేట్ కంపెనీలు రాయితీ పైన, బ్యాంక్ లోన్ ఇప్పించడం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.





డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న రైతు

డ్రోన్ల వాడకంపై అవగాహన :రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి, ఇబ్రహీంపట్నం



డ్రోన్ల ద్వారా నానో యూరియాతో పాటు పురుగు మందులు కూడా కలిపి పిచికారి చేయడం వల్ల పెట్టుబడి తగ్గుతుంది. అలాగే మందు ప్రభావం మొక్కలపైన ఎక్కువగా పడి అధిక దిగుబడులు సాధించ వచ్చు. మండలంలోని గ్రామాల్లో డ్రోన్ల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని మందలించిన తల్లి

- విద్యార్థి ఆత్మహత్య



విష్ణువర్ధన్(ఫైల్)

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన కుమారుడిని తల్లి మందలించడంతో ఉరి వేసుకొని విష్ణువర్ధన్ (15) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. లింగంపేటకు చెందిన మామిడిపెల్లి రాజమురళి-సరిత దంపతుల కుమారుడైన విష్ణువర్ధన్ జగిత్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. విష్ణువర్ధన్ పాఠశాలకు సరిగ్గా వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ సెల్ ఫోన్‌లో ఆన్‌లైన్స్ గేమ్స్‌కు బానిసయ్యాడు. గమనించిన తల్లి సరిత తన కుమారుడిని సోమవారం సాయంత్రం తీవ్రంగా మందలించింది. మనస్థాపం చెందిన విష్ణువర్ధన్ తన ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మూడేళ్ల వయసులో తన ఇంటి వద్ద గోడ కూలిన ప్రమాదంలో బయటపడి బతికిన విష్ణువర్ధన్‌ను కుటుంబ సభ్యులు అల్లారు ముద్దుగా పెంచారు. తండ్రి రాజమురళి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లగా కొడుకు మృతితో స్వగ్రామానికి వచ్చి రోధించిన తీరు స్థానికులను కలచివేసింది. తల్లి సరిత మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ ఎస్‌ఐ కుమారస్వామి పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

ధర్మారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తికి అప్పుల బాధతో పాటు అనారోగ్యం తోడవగా పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కమ్మరిఖాన్‌పేటకు చెందిన పుప్పాల చంద్రశేఖర్ (28) తాగుడుకు బానిసై అప్పులపాలయ్యాడు. దీనికి తోడు నెలరోజుల క్రితం పచ్చకామెర్లు కావడంతో చికిత్స చేయించినా నయం కాలేదు. అనారోగ్యంతో పాటు అప్పులు తోడవడంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ గత నెల 27న పురుగుల మందు తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ చంద్రశేఖర్ మంగళవారం మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ మృతి

బీర్‌పూర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం పై నుంచి పడి చాకటి అన్నపూర్ణ (37) అనే మహిళ మంగళవారం మృతిచెందింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలం మంగేళ(గోడుగూడెం)గ్రామానికి చెందిన చాకటి అన్నపూర్ణ చిన్న కొడుకు మెట్‌పల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. బాబుకు జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని మంగళవారం ఉదయం అన్నపూర్ణకు దూరపు బంధువైన జాన్సన్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రంగసాగర్ గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి అన్నపూర్ణ మృతి చెందింది. మృతురాలి భర్త చాకటి చిత్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టాయ్ మనీని చూపించి మోసం

- నలుగురి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న టాయ్ మనీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు ఆడుకునే టాయ్ మనీ(కార్డున్ పేపర్స్)ని అసలు నోట్ల మధ్య పెట్టి మోసాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని తుంగూరు గ్రామానికి చెందిన పలాజీ శ్రీనివాస్(32), ఉప్పు రమేశ్(38), జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కొండు నరేశ్, సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన గుడిసెల సంతోష్(31)లను అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. జగిత్యాల ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, రమేశ్, నరేశ్, సిరిసిల్ల ప్రాంతానికి చెందిన సంతోష్ అనే నలుగురు వ్యక్తులు కలిసి హైదరాబాద్‌లోని గుర్తుతెలియని వ్యక్తి వద్ద చిన్న పిల్లలు ఆడుకునే టాయ్ మనీని తీసుకొచ్చారు. ఒరిజి నల్ నోట్ల మధ్య పెట్టి షాపింగ్ చేసిన సమయాల్లో బిల్ కడుతూ మోసం చేయాలనే ఉద్దేశంతో సిరిసిల్లకు వచ్చారు. ఈ క్రమంలో సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద నలుగురు వ్యక్తులు తిరుగుతుండగా సమాచారం రావడంతో వెంటనే వెళ్లి అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరి వద్ద 14కట్టల 500 టాయ్‌నోట్స్, రూ. 21వేల నగదు, ఒక కారు, ఐదు మొబైల్స్ స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశామని సీఐ వివరించారు.

జాతీయ రహదారి భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం భూసేకరణ సమస్యలపై సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా చర్చించారు. భూములు కోల్పోయిన వారికి అందిన పరిహారం, మార్కెట్ ధర, భూమి అప్పగించకపోవడానికి కారణాలు వంటి వాటిపై అడిగి తెలుసుకున్నారు. ఇదివరకే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సహకరించేలా చూడాలన్నారు. సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరించి జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని భారత జాతీయ రహదారి సంస్థకు స్వాధీనం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, భారతీ జాతీయ రహదారి సంస్థ ప్రాంతీయ అధికారి శివశంకర్, వరంగల్ ప్రాజెక్టు సంచాలకులు నాగరాజు, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్‌బాబు, రెవెన్యూ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్-జమ్మికుంట రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మంగళవారం మృత్యువాత పడ్డాడు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన సంగెం నరేష్ (33) సుతారి పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బిజిగిరిషరీఫ్ దర్గాకు దర్శనం కోసం వచ్చాడు. తిరిగి గుర్తుతెలియని రైల్లో వెళ్తుండగా జమ్మికుంట-బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామంలోని మానేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న సల్పాల సమ్మయ్య, సల్పాల అశోక్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

గర్భంలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ గర్భిణి ప్రసవం కోసం రాగా గర్భంలో శిశువు మృతి చెందడంతో ఆసుపత్రి ఆవరణలో బంధువులు ఆందోళనకు దిగారు. గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన దుబ్బ రాజ్యలక్ష్మికి సోమవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షలు చేసి అడ్మిట్ చేసుకున్నారు. మంగళవారం ఉదయం స్కానింగ్ నిర్వహించగా శిశువు కదలికలు బాగానే ఉన్నాయని కుటుంబ సభ్యులకు తెలిపారు. సాధారణ ప్రసవం కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పిన వైద్యులు సాయంత్రం శిశువు కదలడం లేదని, మృతి చెందాడని రాజ్యలక్ష్మి భర్త వంశీకి తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిందని ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. గర్భంలో మృతి చెందిన శిశువును తీయడానికి వైద్యులు పట్టించుకోలేదని, మూడు రోజులు అయినా కూడా శిశువును బయటకు తీయవచ్చని సమాధానం చెప్పడంతో వైద్యులపై బంధువులు మండిపడ్డారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే శిశువు మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. గైనకాలజిస్ట్ వైద్యులు అందుబాటులో లేక పోవడం, హెచ్‌ఓడీ కూడా సరిగా ఆసుపత్రికి రాకపోవడం, సాధారణ ప్రసవాల కోసం ప్రయత్నిస్తుండడంతో శిశువులు గర్భంలోనే మృతి చెందుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కూడా సెక్షన్లు చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

ఆకస్మికంగా కదలికలు ఆగిపోయాయి..

డాక్టర్ స్రవంతి, గైనకాలజిస్ట్

రాజ్యలక్ష్మి గర్భంలో శిశువు కదలికలు మధ్యాహ్నం ఆకస్మికంగా ఆగిపోయాయి. గర్భంలోని శిశువును తీయడానికి ప్రయత్నాలు చేశాము. జరిగిన సంఘటనపై వివరాలు చెప్పడానికి ఆమె నిరాకరించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా రజిని



రజినికి నియామకపత్రం అందిస్తున్న ఆర్ కృష్ణయ్య

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన విద్యావేత్త దాసరి రజిని నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేసి అందజేశారు. ఈ సందర్భంగా రజినీ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ బీసీ మహిళా సంక్షేమంతో పాటు సంఘం పటిష్టత కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రజినీ నియామకంపై భారత్ సురక్షాసమితి బాధ్యులు ఏసీఎస్ రాజు, కాశీనాథం, అరవలక్ష్మీ సంఘ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత



బాధితుడికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై ప్రశాంత్‌రెడ్డి

కోనరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అందజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాకు చెందిన భూక్య శ్రీకాంత్ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి బాధితుడికి మొబైల్ అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలుచేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని, కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్‌సాగర్, జిల్లా సహాయకార్యదర్శి దుర్గం బోగేష్, గట్టు ఆకాశ్, రాకేష్, సందేశ్, మానస, మధు, సాయి, ఆదిత్య, వంశీ, రామ్‌చరణ్, ఉదయ్‌కిరణ్, రాకేష్, రఘు, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కో కన్వీనర్ చందు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు విడుదల చేయాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రిషి, అనిల్, సురేష్ తదితరులు ఉన్నారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

జమ్మికుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలో సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే గొంతులను నొక్కుతూ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేష్, బాసిర సంపత్‌రావు, దండిగారి సతీష్, కన్నం సదానందం, ముద్దమల్ల కుమార్, రాజకుమారి, క్రాంతి, రాజు, కిరణ్, ఐలయ్య, తిరుపతయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి బెట్టింగ్ దందా

- ముఠా ఆటకట్టు - ఎనిమిది మంది అరెస్ట్ - రూ. 29.81 లక్షలు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన బెట్టింగ్ ముఠా సభ్యులు, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లి ఆన్‌లైన్‌లో బెట్టింగ్ దందా నిర్వహిస్తున్న ముఠా ఆటకట్టించిన సిటీ సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎనిమది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 29.81 లక్షల రూపాయలు, 18 సెల్‌ఫోన్‌లు, 13 ఏటీఎం కార్డులు, మూడు పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన రాజేష్, అస్లాం, జగిత్యాలకు చెందిన వినయ్ కుమార్, సాయివర్ధన్‌గౌడ్, కోల రామ్, వేల్పుల ఆకాశ్, ప్రణయ్, పెద్దపల్లికి చెందిన రాహుల్, జశ్వంత్‌తేజ, జోడ వేణుగోపాల్ బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లారు. కొద్దిరోజులు పనులు చేసి జీవించారు. చేస్తున్న పనుల ద్వారా వస్తున్న ఆదాయం సరిపోకపోవడంతో ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. ఖేలోస్టార్, ఖేలో-24, ఖేలో ఎక్చేంజ్, ఖేలో స్పోర్ట్స్, విన్ మ్యాచ్ వంటి ఖేలో గేమ్స్ యాప్‌లలో రిజిస్టర్ చేసుకుని బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఎస్‌ఆర్‌నగర్ పరిధిలోని నాగార్జున సర్కిల్ సమీపంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందగా దాడి చేశారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు రాజేష్, అస్లాం పరారీలో ఉన్నారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపారు.

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద



ధర్మపురి వద్ద శ్రాద్ధ మండపం వరకు చేరిన గోదావరి నీరు

ధర్మపురి, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం మంగళవారం కొనసాగింది. గోదావరి ఎగువ మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతుంది. దీనికి తోడుగా ఎస్సారెస్పీ నుంచి 1,25,000 క్యూసెక్కులు, తెల్లవారు జామున కడెం ప్రాజెక్టు నుంచి 1,14,091 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి ప్రవాహం వేగంగా కొనసాగింది. ప్రస్తుతం సంతోషీమాత దేవాలయం, శ్రాద్ధ మండపం, నదీ స్నానఘట్టాలు ఆనుకుని నీరు ప్రవహిస్తోంది. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ధర్మపురి వద్ద సంతోషీమాత, మంగళిగడ్డ, సోమవిహార్, మహాలక్ష్మీ, రాయపట్నం వద్ద స్నానఘట్టాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. స్నానం చేసే భక్తులను గోదావరి నదీ లోతు ప్రదేశంలోనికి అనుమతించడంలేదు. భక్తులు లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయవద్దని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకార్మికులకు లోతు ప్రదేశాలకు వెళ్లవద్దని మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ హెచ్చరికలు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బండి సంజయ్ కృషి

శంకరపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేస్తున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని మొలంగూర్, కేశవపట్నం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 34మంది విద్యార్థులకు సైకిళ్లను మంగళవారం పంపిణీ చేశారు.

ప్రభుత్వ హాస్టళ్ల తనిఖీ

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ హాస్టళ్లను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన వెంట మేనేజర్ రాజిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

6న ఉద్యోగుల క్రీడల ఎంపిక పోటీలు

- 9, 10 తేదీల్లో రాష్ట్ర జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల కరీంనగర్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 6న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి పోటీలను నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఐడెంటీటీ కార్డు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ప్రతిభ చాటే క్రీడాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

● నిర్వహించే క్రీడల వివరాలు

క్రికెట్, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో పురుషులకు మాత్రమే ఎంపిక పోటీలు ఉంటాయి. పరుషులు, మహిళలకు అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్ హాకీ, కబడ్డీ, లాన్ టెన్నీస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నీస్, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖో-ఖో క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

పంచాయతీ కార్యదర్శి తీరుపై ఎంపీవోకు ఫిర్యాదు

శంకరపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ పంచాయతీ కార్యదర్శి తీరుపై తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు మోరె గణేష్ మండల పంచాయతీ అధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి పనుల కోసం వెళ్లిన ప్రజలకు పనులు చేయకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని, వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. అతనిపై విచారణ జరిపించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.


స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది భక్తులు అంజన్న దర్శించుకొని అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడిని కూడా దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చకులు, అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

తపాలా శాఖ ద్వారా చేయూత పింఛన్లు

పంపిణీకి ఫేస్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్

8 మండలాల్లో శ్రీకారం





భగత్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా శాఖ ద్వారా గ్రామాల్లో చేయూత పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కరీంనగర్ తపాలా డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లోని 44 గ్రామపంచాయతీల్లో మొదటి విడతగా పోస్టల్ ద్వారా చేయూత పింఛన్లు అందించేందుకు సిబ్బందిని సిద్ధం చేశారు.

ఇందులో భాగంగా ఆయా పంచాయతీల్లోని 33 మంది బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు కలెక్టర్ పమేలా సత్పతి కార్యాలయంలో అండ్రాయిడ్ మొబైల్స్ అందజేశారు. ఫేస్ రికగ్నేషన్ ద్వారా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లు లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

బోగస్ ఏరివేసేందుకు చర్యలు


చేయూత పింఛన్ల పంపిణీలో బోగస్ ఏరి వేసేందుకు ఫేస్ రికగ్నేషన్ ప్రక్రియకు ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా దివ్యాంగులకు 4,016 రూపాయలు, వృద్ధులకు 2,016 రూపాయల చొప్పున ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. ఫేస్ రికగ్నేషన్ ప్రక్రియతో బోగస్ ఏరివేతతో పాటు, ఫింగర్ ప్రింట్ పడని వృద్ధుల ఇబ్బందులను తొలగించేందుకు సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

తప్పనున్న తిప్పలు

రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్‌తో తపాలా శాఖ ద్వారా పింఛన్లు పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు తిప్పలు తప్పనున్నాయి. గతంలో ఫింగర్ ప్రింట్, బ్యాంకుల ద్వారా పింఛన్లు తీసుకునే వెసులుబాటు ఉండేంది. ప్రస్తుతం తపాలా శాఖ ద్వారా గ్రామాల్లోనే తమకు మంజూరైన పింఛన్లను అందించనుండడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు రావడం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,50,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 29 గేట్లు పైకి ఎత్తి 1,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 1,51,897 క్యూ సెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 666 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.


దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద..

అంతర్గాం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 1.25లక్షల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 28977, వాగులు, వంకల నుండి 1.83 లక్షల క్యూసెక్కుల మొత్తం 3.37 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శనివారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 37గేట్లు ఎత్తి 3.83లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో..

బోయినపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ప్రాజెక్టుకు మంగళవారం 17210 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14000 క్యూసెక్కులు మానేరు, ములవాగు ద్వారా 3210 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. కాగా మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి దిగువ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు మూడు గేట్ల ద్వారా 7500 ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600 తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.52 ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.888 టీఎంసీలకు 26.324 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నాలుగు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.09 టీఎంసీల నీరు ఉంది. మధ్య మానేరు ద్వారా 12800 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ఆర్ఎఫ్‌సీఎల్‌లో కొనసాగుతున్న మరమ్మతులు

- ఈనెల 10వ తేదీ తరువాతే ఉత్పత్తి దశలోకి
- మరమ్మతులకు హైదరాబాద్‌కు యంత్ర సామగ్రి
- ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనుల్లో ఎల్అండ్‌టీ సిబ్బంది
- ఫ్యాక్టరీకి ఇన్సూరెన్స్.. రైతులకు తీరని కష్టాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్‌లో యంత్రాల మరమ్మతు కొనసాగుతోంది. అమ్మోనియా పైప్‌లైన్‌లో లీకేజీతో ఉత్పత్తి నిలిచిపోగా యూరియా దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారు. పరిశ్రమలో ఇప్పటి వరకు 150కోట్ల వరకు ఉత్పత్తి నష్టం ఏర్పడింది. ఆగస్టులో పరిశ్రమ నుంచి తెలంగాణకు 65వేల టన్నులు అందించాల్సి ఉండగా యంత్రాల మరమ్మతుతో ఇతర రాష్ట్రాల నుంచి యూరియా తెప్పించుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి పునరుద్ధరణకు మరో వారం గడువు పట్టే అవకాశం ఉంది. ఈనెల 10వ తేదీ తరువాతే ఉత్పత్తి దశలోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మేలో వార్షిక మరమ్మతుల తరువాత రెండు సార్లు అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. మే 8 నుంచి జూన్ 15వరకు వార్షిక మరమ్మతులు జరిగాయి. ప్లాంట్‌ను జూన్ 16న ఉత్పత్తి దశలో పెట్టగా మళ్లీ నెల రోజులకే అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో షట్‌డౌన్ అయ్యింది. జూలై 16 నుంచి ఆగస్టు 4వరకు ఉత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ ఆగస్టు 5 నుంచి ఉత్పత్తి ప్రారంభమై పది రోజులు కూడా పరిశ్రమ నడవకుండానే 14న మళ్లీ పైప్‌లైన్ లీకై షట్‌డౌన్ అయ్యింది. కీలకమైన హెచ్‌టీఆర్ బైపాస్ చేయడంతో అమ్మోనియా పైప్‌లైన్‌లపై ఒత్తిడి పెరుగుతుంది. హెచ్‌టీఆర్ పని చేసిన సమయంలో అధిక యూరియా ఉత్పత్తికి లోడ్‌ను 110శాతం వరకు కూడా పెంచిన సందర్భాలున్నాయి.

కానీ హెచ్‌టీ ఆర్‌ను బైపాస్ చేసిన తరువాత లోడ్ సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ఈ హెచ్చు తగ్గుల తేడాలతోనే అమ్మోనియా పైప్‌లైన్లలో క్రాక్‌లు ఏర్పడి లీకవుతున్నాయి. ప్లాంట్‌లోని యంత్రాలు సాంకేతిక వైఫల్యాలతో ఉత్పత్తి నిలిచిపోతుంది. యంత్ర సామగ్రిని మరమ్మతు కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఇక్కడ మరమ్మతు పనులను ఎల్అండ్‌టీ సిబ్బంది చేస్తున్నారు.

రైతాంగానికే గోస...

ఆర్ఎఫ్‌సీఎల్ ఆగస్టు మాసంలో 65వేల టన్నుల రాష్ట్రానికి యూరియా ఇవ్వాల్సి ఉంది. ఆగస్టు 4 నుంచి 14వ తేది వరకు 20 వేల టన్నులు వచ్చింది. వర్షాకాల సీజన్‌లో యూరియా వాడకంలో ఆగస్టు మాసం కీలకం. ఆగస్టు 14న షట్‌డౌన్ కావడంతో ఉత్పత్తి, సరఫరా నిలిచిపోయింది. దీంతో రైతులు యూరియా కోసం రోడ్డెక్కారు. దీని ప్రభావం ఢిల్లీని తాకి పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం వరకు సమస్య వెళ్లింది.

మెగా ఆపరేషన్ పాలసీలో ఇన్సూరెన్స్..

ఆర్ఎఫ్‌సీఎల్‌లో యంత్రాల వైఫల్యంతో ఉత్పత్తికి నష్టం జరిగితే మెగా ఆపరేషన్ పాలసీలో ఇన్సూరెన్స్ లభించనున్నది. రూ.6000కోట్లతో నిర్మించిన ఈ పరిశ్రమ యేటా రూ.6000కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం చేస్తుంది. 1284ఎకరాల భూములతోపాటు ఆస్తులు ఉన్నాయి. యాజమాన్యం రూ.2500కోట్లు యంత్రాలపై ఇన్సూరెన్స్ చేసినట్టు తెలుస్తుంది. ప్రభుత్వరంగ ఇన్సూరెన్స్ సంస్థ మెగా ఆపరేషన్ పాలసీలో ఇన్సూరెన్స్ ఉన్నది. ఆపరేషన్ వైఫల్యాలతో ఉత్పత్తి నష్టం జరిగితే ఇన్సూరెన్స్ లభించనున్నది. గతంలో కూడా ఆర్ఎఫ్‌సీఎల్ ఇన్సూరెన్స్ క్లైమ్ చేసింది. రోజుకు సుమారు రూ.1కోటికి పైగా ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఉంది. జూలై షట్‌డౌన్‌లో 18 రోజులు, ఆగస్టు షట్‌డౌన్‌లో 16రోజులకు పైగా ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు రూ.35 నుంచి రూ.50కోట్లు ఇన్సూరెన్స్ క్లైమ్ అయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు గ్యాస్ చార్జిల భారం కూడా తప్పనున్నది. సంస్థకు రూ.150కోట్ల ఉత్పత్తి నష్టం జరిగినా గ్యాస్ చార్జిలు, ఇన్సూరెన్స్‌లతో పెద్దగా నష్ట ప్రభావం ఉండదు.



రాజన్న ఆలయంలో ఈవో ఆకస్మిక తనిఖీలు

క్షేత్రస్థాయిలో పలు విభాగాల్లో రికార్డుల పరిశీలన


లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవో రమాదేవి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఈవో రమాదేవి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం తనిఖీల్లో భాగంగా సెంట్రల్ గోదాం, లడ్డు ప్రసాద కౌంటర్, ప్రధాన బుకింగ్ కౌంటర్, కళ్యాణకట్ట, నూతనంగా ఏర్పాటు చేసిన స్వామివారి నిత్య కళ్యాణం, చండీహోమం, సత్యనారాయణ వ్రతం నిర్వహించే ప్రదేశాలను, గోదాంలోని రికార్డులు, వస్తువులను పరిశీలించారు.

పంటకోత ప్రయోగాల డిజిటల్ యాప్‌పై శిక్షణ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగాల డిజిటల్ యాప్‌పై నగరంలోని గణాంక భవన్‌లో మంగళవారం ఎంపీఎస్‌వోలు, ఏఈవోలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రాజారాం మాట్లాడుతూ ప్రతీ ప్రాథమిక కార్యకర్త అయిన ఎంపీఎస్‌వోలు, ఏఈవోలు వారికి కేటాయించిన గ్రామాల్లో పొరపాట్లు లేకుండా పంటకోత ప్రయోగాలు నిర్వహించాలని ఆదేశించారు. సేకరించిన వివరాలను సమయానికి డీజీసీఇఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ, స్టాటిస్టికల్ ఆఫీసర్ కిషన్‌రావు, ఏడీఏలు, ఎంఏవోలు, డీవైఎస్‌వోలు, ఎంపీఎస్‌వోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

మత్తడి ఎత్తు తగ్గించాలి

సైదాపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మకల్ చెరువు మత్తడి ఎత్తు తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ బొమ్మకల్ చెరువు మత్తడి ఎత్తు ఉండడం వల్ల చాలా వరకు రైతుల భూములు చెరువులో మునిగి పోయి రైతులు నష్టపోతున్నారన్నారు. వెంటనే మత్తడి ఎత్తు తగ్గించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్, రైతులు రమాదేవి, పద్మనాభం, శంకర్, వెంకటరాజం, సుదర్శన్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్ అందజేస్తున్న రాజన్నసిరిసిల్ల కలెక్టర్

మానేరులో గల్లంతైన వ్యక్తి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం

రూ. 5 లక్షల చెక్కు అందజేసిన కలెక్టర్

గంభీరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద గల్లంతైన వ్యక్తి కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. అలాగే వరదలో చనిపోయిన పశువుల యజమానులకు పరిహారం చెక్కును అందజేశారు. మానేరు వద్ద పంపుకాడి నాగయ్య మానేరు వాగు దాటుతుండగా గల్లంతయ్యాడు. అతడి భార్య లక్ష్మికి చెక్కును కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం అందజేశారు. లింగన్నపేట గ్రామానికి చెందిన మణేమ్మకు చెందిన 2 పశువులు, ప్రవీణ్‌కు చెందిన ఒక పశువు వరదల్లో గల్లంతు కాగా, రూ.లక్ష, రూ.50వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ విజయ, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

దర్శనీయం.. దత్తాత్రేయుడి ఆలయం


మిడ్‌మానేరు నీటి మధ్యలో ఆలయం (ఏరియల్ వ్యూ)

- చుట్టూ మిడ్ మానేరు జలాలు
- ఎంపీ నిధులతో బోట్ సౌకర్యం
- కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి


సర్ప రూపంలో వెలసిన దత్తాత్రేయుడు

బోయినపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ మిడ్ మానేరు జలాలు... మధ్యలో గుట్టపై పచ్చటి చెట్ల మధ్య దత్తాత్రేయస్వామి ఆలయం.. గుట్ట ఒక ద్వీపంలా కనిపిస్తూ కనువిందు చేస్తోంది. బోయినపల్లి మండలం వరదవేల్లి గ్రామ శివారులో ఈ ఆలయం ఉంది. అరుదైన రాహు రూపా(సర్పరూప) శయన జంట సర్పాలతో దాగి ఉండి దత్తాత్రేయుడు గుట్టపై వెలసి నిత్య పూజలు అందుకుంటున్నాడు. అంతేకాకుండా గుట్టపై వెంకటేశ్వర స్వామి ఆలయం ఉన్నది.

కోరిన మొక్కులు తీర్చే స్వామి..

కోరిన మొక్కులు తీర్చే స్వామిగా శ్రీదత్తాత్రేయ స్వామివారిని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి ఏటా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. ఏటా దత్త జయంతిని భక్తులు, గ్రామస్థులు వైభవంగా నిర్వహిస్తారు.

ఎంపీ నిధులతో ఆలయానికి బోట్ సౌకర్యం..

మిడ్ మానేరు నిండడంతో గతేడాది ఆలయం చుట్టూ బ్యాక్ వాటర్ చేరింది. దీంతో నిత్య పూజలకు ఇబ్బందులు కావడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.10.86 లక్షలతో బోట్ సౌకర్యం కల్పించారు.

గురు, ఆది వారాల్లో ప్రత్యేక పూజలు...

రత్నాకర శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు



నిత్య పూజలతో పాటు ప్రతి పౌర్ణమి, గురు, ఆది వారాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఆయా రోజుల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తాం.



రాజన్న ఆలయ మొదటి దశ అభివృద్ధి పనులు ప్రారంభం

కళాభవనం కూల్చివేత

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులకు రూ.76 కోట్లు, అన్నదాన సత్రం నిర్మాణ పనులకు రూ.33 కోట్ల నిధులు మంజూరైన విషయం తెలిసిందే. అయితే అభివృద్ధి పనులను వేగవంతం చేసి సమ్మక్క-సారక్క జాతరకు వచ్చే భక్తులకు ఆలయాన్ని పునఃప్రారంభించి స్వామివారి దర్శనం కలిగేలా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఈవో రమాదేవీలు చూస్తున్నారు.

అందులో భాగంగా రాజన్న ఆలయంలో పనులను మంగళవారం కూల్చివేతలతో ప్రారంభించారు. రాజన్న ఆలయం ముందు భాగంలో ఈశాన్యం వైపు 1992 సంవత్సరంలో సుమారు రూ.76 లక్షలతో నిర్మించిన కళాభవన్‌ను కూల్చివేశారు. అంతే కాకుండా కల్యాణకట్ట వద్దగల క్యూలైన్‌లను సైతం తొలగించి అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. 33 యేళ్లుగా సేవలందించిన కళాభవన్ కూల్చివేయడంతో భక్తులకు అందించే సేవలైన శివకళ్యాణం, చండీహోమం, సత్యనారాయణ స్వామి వ్రతం వంటి పూజలను రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లోకి మార్చి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి చర్యలు తీసుకున్నారు.


కళాభవన్‌ను నుంచి కూల్చివేత పనులు


33 యేళ్లుగా సేవలు అందించిన కళాభవన్

బద్ది పోచమ్మ ఆలయంలో కొనసాగుతున్న పనులు..

రాజన్న ఆలయ మొదటి దశ అభివృద్ధి పనుల్లో భాగంగా శ్రీభీమేశ్వర ఆలయంలో భక్తులకు దైవ దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్‌లు, ఫ్లైఓవర్‌లు, అభిషేక పూజలు, సంకల్ప పూజల కోసం షెడ్డుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. భీమేశ్వర ఆలయంలో పనులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన వెంటనే రాజన్న ప్రధాన ఆలయంలో దర్శనాలను నిలిపివేసి భీమేశ్వర ఆలయంలో దర్శనాల ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్ భీమేశ్వర ఆలయంలో వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణమూర్తి

కోల్‌సిటీ టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడంతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతీ ఒక్కరూ జాగ్రత్త వహించాలని సీఐ కృష్ణమూర్తి అన్నారు. గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ప్రత్యేక శిబిరం మంగళవారం కొన సాగింది. ఈ సందర్భంగా షీటీం, సైబర్ క్రైం మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం షీటీం మెంబర్ స్నేహలత మహిళల భద్రతపై వివరించారు. అంతకుముందు వలంటీర్లు శ్రమదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ యాట ప్రసాద్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ నరేష్, దామరకొండ శంకర్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందపెల్లి సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక అశోక్ ఎన్నికయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్‌లో నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పెరుగుతున్న ధరలతో కార్పొరేషన్‌లో కటింగ్, షేవింగ్‌కు ధరలను పెంచామని, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పుట్ట మధుపై ఆరోపణలు చేస్తే సహించం

మంథని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కండువా కప్పుకున్న మాజీ ఎంపీపీ కొండ శంకర్ తమ నాయకుడు పుట్ట మధుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని బీఆర్ఎస్ నాయకులు కారెంగుల సురేష్, కొండ రవీందర్ హెచ్చరించారు. మంగళవారం వారు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు మెప్పు కోసమే మాజీ ఎమ్మెల్యే మధుపై విమర్శలు చేస్తున్నారన్నారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, బడికెల సతీష్, పెగడ శ్రీనివాస్, ఎరుకల రవి, పిల్లి సత్తయ్య, ఆసీఫ్, అడిచర్ల సమ్మయ్య పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు వైకల్య నిర్ధారణ శిబిరం

మంథని రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల విద్యార్థులకు బుధవారం జిల్లా కేంద్రంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో దాసరి లక్ష్మి తెలిపారు. మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులకు అలింకో, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచిత పరికరాల కోసం శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలలోపు దివ్యాంగ విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు విలీన విద్య ఉపాధ్యాయులు శ్రీనివాస్, సౌజన్యను 9948675249, 9441090692 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. శిబిరానికి వచ్చే విద్యార్థులు 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డులు వెంట తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై యువతకు శిక్షణ

ధర్మారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మేరా యువభారత్ పెద్దపల్లి, యవశక్తి యూత్ వెల్ఫేర్ పత్తిపాక సంయుక్తంగా యువతకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిస్టిక్ యూత్ ఆఫీసర్ వెంకట్‌రాంబాబు, డిస్టిక్ ఇండస్ట్రీయల్ జనరల్ మేనేజర్ కీర్తి కాంత్, ఈడీసీ మేనేజర్ హరీష్, అసిస్టెంట్ మేనేజర్ రవి అవగాహన కల్పించారు. పరిశ్రమల స్థాపన, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్‌పై వివరించారు. నాయకులు కన్నం అంజయ్య, మెడవేని శ్రీను, దిలీప్, రేషవేణి మహేష్‌లు మాట్లాడారు. సిద్దార్థ, రాహుల్, ఎండీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

గర్రెపల్లి పాఠశాలలో ఎన్నికలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థి లీడర్ల ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రధానోపాధ్యాయిని వి.కవిత మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 20న ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం ఫలితాల ప్రకటన ఉంటాయని పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎయిడ్స్‌పై కళాజాత

కమాన్‌పూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, టీ సాక్స్ సంయుక్తంగా ఎయిడ్స్ నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీఎంహెచ్‌వో అధ్యక్షతన జనజాగృతి కళాబృందంతో ఆటాపాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జీఎస్ఎం, ఫోర్‌డబ్ల్యూఎస్ సభ్యులు, కార్యదర్శి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటిన అఖిల


అఖిలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్

ధర్మారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 11వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని సత్తాచాటింది. ధర్మారం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అఖిల గతనెల 30 నుంచి మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో పాల్గొంది. పోటీలలో అండర్ 18 హైజంప్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. మంగళవారం అఖిలను ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకనీ కొమురయ్య మేకల సంజీవ్ ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినికి ప్రోత్సాహకం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2024-25 పది ఫలితాల్లో తరగతి మొదటి ర్యాంకు సాధించిన పెర్క అమూల్యను అభినందిస్తూ ప్రోత్సాహకాలు అందించారు. మంగళవారం రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎర్రోజుల చక్రపాణి రూ.3 వేలు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చెరుకు మహేందర్‌రెడ్డి రూ.1200 అందించారు. ప్రధానోపాధ్యాయులు మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

కమాన్‌పూర్ సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని మండల కన్వీనర్ తాటికొండ శంకర్ అన్నారు. రొంపికుంటలో మంగళవారం కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. నాయకులు గర్రంలక్ష్మీమల్లు, తిరుపతి, బొమ్మగాని అనిల్‌గౌడ్, పోల్దాసరి సాయికుమార్, మేకల సంపత్‌యాదవ్, కొండ వెంకటేష్, జాబు సతీష్ ఎలబోయిన రాంమూర్తి, పెండ్లినారాయణ, తదితరులున్నారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న డీసీపీ కరుణాకర్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్‌లో రికార్డులు, కేసుల పురోగతి, విచారణలో ఉన్న కేసుల గురించి వాకబు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయనే విషయంపై ఆరా తీశారు. మహిళా సిబ్బంది అన్ని రకాల డ్యూటీలు చేసేలా ప్రోత్సహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుగాలని, సమస్మాక ప్రాంతాల్లో నిఘా పెట్టాలన్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు భూమేష్, రమేష్, అనూష ఉన్నారు. డీసీపీ కరుణాకర్ బస్టాండ్ కాలనీలోని వినాయక మండపంలో నిర్వాహకులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని, యువకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎదురవకుండా చూడాలన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనోత్సవాన్ని శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులు సూచించారు. మున్సిపల్ కమిషనర్ టి రమేష్, తహసీల్దార్ బషీరొద్దిన్, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్, అశోక్ రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ రాజు, శ్రావణ్ తదితరులు చెరువు వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిర్వాహకులు సమయ పాలన పాటించాలని, ఈత రానివారు చెరువు వద్దకు రావద్దన్నారు. ప్రశాంతతకు భంగం కలిగించే పరిస్థితులు కలిగించవద్దన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించవద్దన్నారు.

పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన గణపతి మండప నిర్వాహకులతో పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. సీఐ సుబ్బారెడ్డి పలు సలహాలు సూచనలు అందించారు. ఎస్ఐ శ్రావణ్ కుమా ర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాన్ని శుక్రవారం నిర్వహించాలని ఎంపీడీవో ఐనాల ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎంపీఓ రమేష్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, ఎలక్ట్రిసిటీ ఏఈ ఎండీ ఖాసీంతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా గణపతులను శుక్రవారం నిమజ్జనం చేయాలని తెలిపారు. గణపతి మండపాల నిర్వాహకులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): గణపతి నిమజ్జనం శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని తహసీల్దార్ జక్కని స్వర్ణ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో ఉత్సవకమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంపిడిఓ పద్మజ, ఎస్ఐ సనత్‌కుమార్, ఎంపిఓ శేషయ్యసూరి, పంచాయత్‌రాజ్ ఏఈ రాజ్‌కుమార్ కార్యదర్శులు పాల్గొన్నారు.

18 మంది డీజే ఆపరేటర్ల బైండోవర్

ఓదెల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డీజే ఆపరేటర్లను మంగళవారం పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఎస్ఐ మాట్లాడుతూ గణపతి నిమజ్జన వేడుకల్లో డీజేలను ఉపయోగించవద్దన్నారు. పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలోని 18 మంది డీజే ఆపరేటర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

గణేష్ మండపాల్లో నైవేద్యాలు.. అన్నదానాలు...


సుల్తానాబాద్ అల్ఫోర్స్ పాఠశాలలో 151 రకాల నైవేద్యాలు, మహిళల గోరింటాకు వేడుక

సుల్తానాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత జెండా చౌరస్తా, ట్యాంక్ రోడ్డు, గుడిమిట్ట, వేణుగోపాల స్వామి గుడి, ప్రభునగర్, గౌడవీధి, గాంధీనగర్, పాత పెట్రోల్ బంకు, శ్రీరాంనగర్ తదితర మండపాల వద్ద కుంకుమ పూజలు, అన్నదానాలు చేశారు. వైశ్యా భవన్‌లో వినాయకుడికి లక్ష గరికెలతో ప్రత్యేక పూజలు చేశారు. కొందరు తమలపాకులతో అలంకరించారు. అల్ఫోర్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు 151 రకాల నైవేద్యాలను సమర్పించారు. అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతు పాఠశాలలో పండుగల వేడుకలు నిర్వహిస్తూ విద్యార్థులకు ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తున్నామన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): కేశనపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద మాజీ సర్పంచ్ నూనె కుమార్, ఉపసర్పంచ్ తాత స్వప్నబాలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం, మహిళలు గోరింటాకు కార్యక్రమం నిర్వహించారు. మాజీ వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వినాయక మండపాల్లో భక్తులు గణనాథునికి ఘనంగా పూజలు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని వివేకానంద యూత్ ఆధ్వర్యంలో కుంకుమపూజ నిర్వహించగా, లక్ష్మీనగర్‌లోని బోళ్ల బజార్, ఫైవింక్లయిన్, విఠల్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాకతీయ హైస్కూల్ గణనాథుడి నిమజ్జనం

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకతీయ ఉన్నత పాఠశాల గణనాథుడిని సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. పాఠశాల ఆవరణలో గణనాథుడికి 5 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థులు వేదశ్రీ, రిషిక్‌లకు సైకిళ్ళు అందజేశారు. డప్పు చప్పుళ్లు, ఆటపాటలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి, డైరెక్టర్లు రవికిరణ్ రెడ్డి, స్రవంతి రెడ్డి, పావని రెడ్డిలు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ సదస్సును విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయు నాయకుడు ఆకుల వెంకన్న

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 7 న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర నాయకులు కాదాసీ లింగమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ కనీస వేతనం లేక కార్మికుల జీవితం అంధకారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మికుల కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బాబు, బాలకృష్ణ, శివ, సుమన్, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహించే ఐఎఫ్‌టీయు రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సెంటినరీకాలనీలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. నాయకులు రమేశ్, రాజనర్సు, సంపత్, సురేష్, శ్రీనివాస్, రాజమౌళి, రమేశ్, ఎల్లయ్య, పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి రాష్ట్రస్థాయి పురస్కారం

కమాన్‌పూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేత్రదానాలను ప్రోత్సహించినందుకు సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. మంగళవారం నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా వాసన్ ఐ బ్యాంకు డాక్టర్ అరవింద ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందర్య విజ్ఞాన కేంద్రంలో పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ కె.శశిశ్రీ పురస్కారాన్ని అందజేశారు. సదాశయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, నలవెల్లిశంకర్, భీష్మాచారి, చంద్రమౌళి, పృధ్వి పాల్గొన్నారు.

కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

మంథని, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కవిత చేసే పనుల వలన పార్టీకి నష్టం జరుగుతున్న తీరుపై పార్టీ అధినేత కేసీఆర్ ఆమెను తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా సహించనని కేసీఆర్ గతంలో చెప్పారన్నారు. ఆమెను సస్పెండ్ చేస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. కవితపై సస్పెన్షన్ నిర్ణయాన్ని స్వాగతి స్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి తెలిపారు.

ఎలిగేడు ఎస్ఐగా మధుకర్



ఎలిగేడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు ఎస్ఐగా మధుకర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసే ఎస్ఐ సత్యనారాయణ సాధారణ బదిలీలలో భాగంగా విఆర్ రామగుండం కు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ గా చేరిన మధుకర్‌కు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు ఘన నివాళి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెంటం ఉదయ్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రధానచౌరస్తాలో నగరపాలక అధ్యక్షుడు బొంతల రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.రవికుమార్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ చేసిన సేవలను కొనియాడారు. మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటిరాజేష్ ఆధ్వర్యంలో అల్లూరులో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్‌రావు, అనుము రాములు, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, మెరుగు రాజేష్, అవినాష్, సాధుల శ్రీనివాస్, ఉదయ్, ఎం.నరేష్, ఆకుల శ్రీనివాస్, వికాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. నెహ్రూ విగ్రహం వద్ద వైఎస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, పన్నాల రాములు, దామోదర్‌రావు, రాజలింగం, మీస సత్తన్న, అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, అమిరిశెట్టి తిరుపతి, ఎండీ అమీనొద్దిన్, న్యాతరి దేవేందర్, చంద్రయ్య, పోచం పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కేశనపల్లిలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజయ్యలు మాట్లాడుతూ పేద, సామాన్య వర్గాల కోసం వైయస్సార్ చేసిన సేవలను గుర్తుచేశారు. బుచ్చరావు, జాగిరి సమ్మయ్య, వినీత్, అల్లం కుమారస్వామి, గాదం శ్రీనివాస్, పెగడకుమార్, వకులారాణిశంకర్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మల్యాల తిరుపతి, నాయకులు ముస్తాక్, అబ్దుల్ రఫీక్, అనవేణలక్ష్మీరాజం పాల్గొన్నారు.



ఆర్జీ1లో స్ట్రక్చర్ సమావేశం


సమావేశంలో పాల్గొన్న అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో మంగళవారం గుర్తింపు సంఘం ప్రతినిధులు, అధికారులతో ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం రమేష్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం జరిగింది. అండర్ గ్రౌండ్ మైన్స్ జీడీకే 1, 2, 2ఎ, 11ఇంక్లైన్‌లలో పనిచేస్తున్న సపోర్ట్‌మెన్‌లను ఒక పని స్థలం నుండి ఇంకో పని స్థలానికి మార్చడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న సిబ్బంది హెపటైటిస్ బీ వ్యాక్సిన్ ఇవ్వాలని, వారి ఆరోగ్యాన్ని కాపాడే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. 1ఇంక్లైన్ 49 లెవెల్‌లో బంకర్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు. ఎక్స్‌ప్లోరేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఆటో ఎలక్ట్రీషియన్ ఏర్పాటు చేయాలన్నారు. 11 ఇంక్లైన్‌లో ఫ్యాన్ హౌజ్ చుట్టూ ఇనుప కంచెను, ఇద్దరు ఫ్యాన్ ఆపరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. సివిల్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీఎం ఆఫీస్‌లో బైక్ షెడ్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు ఇప్పించాలని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోశం, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీను, మహేష్, అశోక్, వెంకటరెడ్డి, సిద్దమల్ల రాజు, మల్లిఖార్జున్, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, అధికారులు ఆంజనేయులు, రమేష్, జితేందర్‌సింగ్, అంబిక, వసంత కుమార్, వేణు, హన్మంతరావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి లక్ష్యాలు సాధించాలి

గోదావరిఖని, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బొగ్గు రంగంలో పోటీని ఎదుర్కొవడానికి వీలుగా ప్రతీ ఒక్క ఉద్యోగి బాధ్యతగా పని చేసి లక్ష్యాలు సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ స్పష్టం చేశారు. అన్ని ఏరియాల్లోనూ అనవసర దుబారాను నివారించి పొదుపు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో నిర్వహించిన బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టుల పురోగతిపై సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఉత్పత్తికి విఘాతం కలిగిందని, జరిగిన నష్టాన్ని పూడ్చుకుని, ప్రస్తుత లక్ష్యాలను సాధించడానికి ఇకపై రోజుకు 1.8లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.1లక్షల టన్నుల బొగ్గు రవాణా సాధించాలని నిర్దేశించారు. కొత్త ప్రాజెక్టుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది ప్రారంభించే మూడు గనుల వల్ల 10మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని, అలాగే వచ్చే ఏడాది ప్రారంభించే గనుల వల్ల మరో 10మిలియన్ టన్నుల ఉత్పత్తిని పెంచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఎం తిరుమలరావు, ఈడీ కోల్ మూమెంట్ బీ వెంకన్న, జీఎం(కోఆర్డినేషన్, మార్కెటింగ్) టీ శ్రీనివాస్, జీఎం(సీపీపీ) ఏ మనోహర్ పాల్గొన్నారు.

ఓసీపీ-1 లో రక్షణపై అవగాహన సదస్సు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2లోని ఓసీపీ-1 ప్రాజెక్టులోని బేస్‌వర్క్‌షాప్‌లో మంగళవారం రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఏరియా రక్షణ అధికారి భానుప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదక సాధించాలని, పనిచేసే ప్రదేశంలో పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, అన్ని జాగ్రత్తలు చూసుకున్న తర్వాతనే పని ప్రారంభించాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు నక్క రమేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు జక్కుల దామోదర్‌రావు, రక్షణ అధికారి అజయ్‌కుమార్, మోహన్‌రెడ్డి, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)


బ్రాహ్మణపల్లిలో ఓటర్ జాబితా ప్రచురిస్తున్న కార్యదర్శి

పరిస్థితి నెలకొన్నది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ముందుగా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ఏవైనా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలైతే రెండు, మూడు విడతల్లో నిర్వహించనున్నారు.గతంలో జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను మాత్రం ఒకే విడతలో చేపట్టనున్నారు.

మంథని/మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వార్డులు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల తుది జాబితాను ఎంపీడీవో కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. అభ్యంతరాల సవరణ అనంతరం తుది డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఎంపీడీవో శశికళ, ఎంపీవో అనిల్‌రెడ్డిలు ప్రకటించారు. మండలంలో 35 గ్రామ పంచాయతీలు, 282 వార్డులు ఉండగా వాటిలో 282 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో పురుషుల కంటే 889 మంది మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో 16 గ్రామపంచాయతీలు, 158 వార్డులు, 11 ఎంపీటీసీ స్థానాలు, 1 జెడ్‌పీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు జరగగా 2024 జనవరి 31తో పదవీ కాలం ముగిసింది. ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు 2019 జూన్‌లో జరగగా 2024 జూన్ 3తో వీరి పదవీకాలం ముగిసింది. దీంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ఓటరు తుది జాబితాను ప్రకటించామని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తెలిపారు. 30 గ్రామాల్లో 294 పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామాల్లో వార్డుల వారిగా ఓటరు తుది జాబితాను ఎంపీడీవో తిరుపతి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

యూరియా కోసం చెప్పుల క్యూ


యూరియా కోసం క్యూలో పెట్టిన చెప్పులు

జూలపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు యూరియా బాధలు తప్పడం లేదు. మండలకేంద్రంలోని సహకార సంఘంకు మంగళవారం యూరియా బస్తాలు రానున్నాయనే సమాచారంతో ఉదయం ఆరు గంటలకే రైతులు చేరుకొని చెప్పులను క్యూలో పెట్టారు. రైతులు పడుతున్న ఇబ్బందులను ఎవరు పట్టించుకోవడంలేదన్నారు. 450 బస్తాలు రావడంతో రైతులకు టోకెన్ ఇచ్చి పంపిణీ చేశారు.

ఫోటో స్టూడియోల బంద్

జ్యోతినగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ఏరియాలో మంగళవారం ఫోటో స్టూడియోల బంద్ విజయవంతమైంది. ఫొటోఅండ్‌వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి నవీన్ ఆధ్వర్యంలో బంద్ పాటించారు. పెరిగిన ముడి సరుకు ధరల కారణంగా ధరలను పెంచాల్సి వచ్చిందన్నారు. మేడిపల్లి సెంటరు నుంచి ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి ధరల పట్టికను విడుదల చేశారు. సుందిళ్ల రాకేష్, నరేష్, బుర్ర వినయ్ సాగర్, జెఎస్ దబ్బెట రవి, కుమార్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

పాలకుర్తి,(ఆంధ్రజ్యోతి): మండలంలో ఫొటో స్టూడియోల బంద్ విజయవంతమైంది. పెరిగిన ధరలు అమల్లోకి రావాలని బంద్ చేపట్టామన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధరల పట్టికను పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. హెడ్ కానిస్టేబుల్ మధనయ్య, కానిస్టేబుల్ ప్రత్యూష, అనూష, వీరస్వామి, వైద్య రాజేందర్, శ్రీనివాస్, రాజేందర్, శంకర్, రాజు, పాల్గొన్నారు.